



అశోక్‌ని సన్మానిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



హకీంపేట్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న కేటీఆర్

## రైతు దీక్షకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

### తుంకిమెట్లలో జెండావిష్కరించిన మాజీ మంత్రి కేటీఆర్

కొడంగల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ పరిధిలోని కోస్గిలో చేపట్టిన రైతు సమస్యలపై చేపట్టిన దీక్షకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. బొంరాస్‌పేట్ మండలం తుంకిమెట్ల నుంచి హకీంపేట్ మీదుగా కోస్గికి బయలుదేరి వెళ్లారు. మార్గమధ్యలో లగచర్ల సరిహద్దు ప్రాంతంలో వాహనాల్లో నుంచి కిందికి దిగి పంట పొలాలను పరిశీలించారు. అక్కడి నుంచి హకీంపేట్‌లో పులిచర్లకుంట తండాకు చెందిన భూ నిర్వాసితులతో కలిసి అభివాదం చేశారు. ఈ క్రమంలో పాత్లావత్ ప్రవీణ్, జ్యోతి దంపతుల కూతురిని ఎత్తుకొని నామకరణం చేశారు. అక్కడి నుంచి కోస్గిలో జరిగిన రైతు దీక్షకు బయలుదేరి వెళ్లారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తదితరులున్నారు. కోస్గిలో జరిగిన రైతు దీక్షలో కొడంగల్ నియోజకవర్గంతో పాటు వివిధ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. కేటీఆర్ పర్యటన సందర్భంగా పోలీసులు సీఐ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

**తుంకిమెట్లలో ఘన స్వాగతం**

బొంరాస్‌పేట్: కోస్గిలో నిర్వహించిన రైతు దీక్షకు తుంకిమెట్ల మీదుగా వెళ్తున్న కేటీఆర్‌కు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తుంకిమెట్లలో ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అదే విధంగా సర్వాయిపాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల గుండె పోటులో మృతి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు మోనాచారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కోట్ల యాదగిరి, శేరి నారాయణరెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవం.. మల్లన్న కల్యాణం

- ఆకట్టుకున్న ఒగ్గు కళాకారుల ప్రదర్శనలు
- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ
- పెద్ద సంఖ్యలో హాజరైన భక్తజనం

7



**వికారాబాద్ జిల్లా:**

| | |
|---|---|
| పాత ఎంపీటీసీ స్థానాలు | 221 |
| పరిగి బల్దియాలో విలీన గ్రామాలు | 05 |
| జిల్లాలో కొత్తగా చేరిన జీపీలు | 14 |
| ప్రస్తుత ఎంపీటీసీ స్థానాలు | 227 |
| పాత పంచాయతీల సంఖ్య | 585 |
| ప్రస్తుత పంచాయతీలు: | 594 |
| వార్డులు | 5,058 |
| మున్సిపాలిటీలు | 04 |

# కుదింపు!

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉమ్మడి జిల్లాలోని కొన్ని గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో పంచాయతీ, ప్రాదేశిక నియోజకవర్గాల పరిధి తగ్గిపోయింది. దీంతో మండలాలు తగ్గడంతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల సంఖ్య సైతం తగ్గింది. ఈ నేపథ్యంలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఎంపీటీసీలు, పంచాయతీల సంఖ్య తగ్గగా.. వికారాబాద్‌లో మాత్రం పెరిగింది. ఈ నేపథ్యంలో కొందరు నాయకుల రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహులు నిరాశ చెందుతున్నారు. పంచాయతీల సంఖ్య తగ్గడంతో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీగా పోటీ చేయాలనుకున్న నాయకుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.

- రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో తగ్గిన ఎంపీటీసీ, గ్రామ పంచాయతీల సంఖ్య
- వికారాబాద్ జిల్లాలో మాత్రం పెరుగుదల
- మున్సిపాలిటీల్లో విలీనమైన పలు గ్రామాలు
- ఆశావహులకు తగ్గనున్న అవకాశాలు

వికారాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సమాయత్తం అవుతోంది. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే ప్రతి మండలంలో కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొన్ని గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం కావడం వల్ల కొన్నిచోట్ల ఎంపీటీసీ స్థానాల్లో మార్పులు చేర్పులు జరిగాయి. దీంతో రంగారెడ్డి జిల్లాలో ఎంపీటీసీ స్థానాల స్వరూపం మారింది ఎంపీటీసీ స్థానాలు మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో వీటి స్థానాలు తగ్గాయి. అలాగే పంచాయతీల పరిస్థితి కూడా

మిగతా 7వ పేజీలో...



### జానపద కళాకారుడికి
## కలెక్టర్ సన్మానం

తాండూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ప్రదర్శన ఇచ్చిన తాండూరు జానపద కళాకారుడు ప్రసాద్‌ను కలెక్టర్ ప్రతీక్‌జైన్ అభినందించారు. సోమవారం జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఆయనను కలెక్టర్ శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ జిల్లా అధికారి హనుమం తరావు, తదితరులు ఉన్నారు. కాగా, అశోక్ ఆధ్వర్యంలో ఢిల్లీలో గరగా నృత్యాన్ని ప్రదర్శించిన విషయం తెలిసిందే.



మాట్లాడుతున్న రాజేశ్‌రెడ్డి

### గ్రంథాలయాలను సద్వినియోగం
## చేసుకోవాలి

### జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు పోటీ పరీక్షల కోసం గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి సూచించారు. సోమవారం రేగడిమైలారం గ్రామంలో నిరుద్యోగ యువకులు, గ్రామ కాంగ్రెస్ నాయకుల కోరిక మేరకు నూతన గ్రంథాలయ ఏర్పాటుకు ఆయన హామీ ఇచ్చారు. స్థానిక అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో గ్రంథాలయ ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. గ్రంథాలయాల్లో వంద రూపాయలు చెల్లించి సభ్యులుగా చేరితే కావాల్సిన పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదువుకోవచ్చన్నారు. పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. అదే విధంగా దీప్లానాయక్ తండాకు రోడ్డు మంజూరుకు సైతం కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, వెంకట్రాములుగౌడ్, మల్లికార్జున్, ఎల్లప్ప, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సెలవుల్లో డీఎంహెచ్‌వో..
# కలెక్టరేట్‌లో చర్చనీయాంశం

### ఉమాగౌరికి బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వ ఉత్తర్వులు



మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి సోమవారం సెలవులపై వెళ్లాడు. కాగా, 7వ తేదీన ఆయనను బాధ్యతల నుంచి రిలీవ్ చేస్తూ ఉమాగౌరిని జిల్లా అదనపు పబ్లిక్ హెల్త్ ఆఫీసర్, జిల్లా వైద్యాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే రఘునాథస్వామిని వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్‌కు రిపోర్టు చేయాలని హైకోర్టు ఆదేశాలతో ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సోమవారం విధులకు హాజరైన రఘునాథస్వామి ఓ సమావేశం మధ్యలో నుంచి హడావుడిగా కలెక్టర్‌ను కలిసి సెలవు పత్రం అందజేసి బయటకు వెళ్లిపోయారు. ఉన్నట్టుండి హఠాత్తుగా డీఎంహెచ్‌వో సెలవుపై వెళ్లడం కలెక్టరేట్‌లో చర్చనీయాంశమైంది. కాగా, గతంలో ఉమాగౌరి జిల్లాలో సివిల్ సర్జన్‌గా పనిచేస్తుండేది. 16 నెలల క్రితం అప్పటి డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ బదిలీపై వెళ్లిన సమయంలోనే ఆమెను డీఎంహెచ్‌వోగా నియమిస్తారనే ప్రచారం జరిగింది. కాని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోనే పనిచేస్తున్న రఘునాథస్వామి తన పలుకుబడిని ఉపయోగించి డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ఉమాగౌరికి అప్పటి నుంచి 2 సార్లు (గతేడాది జూన్, సెప్టెంబర్‌లో) వైద్యశాఖ నుంచి డీఎంహెచ్‌వోగా ఆదేశాలు వచ్చినప్పటికీ, రఘునాథస్వామి తన బలంతో ఆ ఆదేశాలను అమలు కాకుండా నిలిపివేయించారు. దీంతో ఉమాగౌరి న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో న్యాయస్థానం ఆదేశాల మేరకు తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమాగౌరి బాధ్యతలు స్వీకరించే వరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణికి బాధ్యతలు అప్పగించారు.



రఘునాథస్వామి, డీఎంహెచ్‌వో

**అసలు ఏం జరుగుతోంది?**

డీఎంహెచ్‌వో రఘునాథస్వామి సోమవారం సెలవులపై వెళ్లడంతో జిల్లా వైద్యాశాఖాధికారి కార్యాలయంలో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. వివాదరహితుడిగా, సిబ్బందితో సఖ్యతగా ఉండే ఆయన ఆకస్మికంగా సెలవుపై వెళ్లడంతో అసలు ఏం జరుగుతుందో అర్థం కాక సిబ్బంది అయోమయానికి గురయ్యారు. కొంత కాలంగా కార్యాలయంలో సిబ్బందిపై అంతర్గతంగా తరుచూ ఫిర్యాదులు వస్తున్నాయి. ఇద్దరు, ముగ్గురు సిబ్బంది డీఎంహెచ్‌వోగా ఎవరు వచ్చినా వారి చుట్టూ చేరి ఓ కోటరిని ఏర్పాటు చేసి తప్పుదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సిబ్బంది మధ్య సమన్వయం లేకపోవడం, ఆదిపత్య పోరుతో కార్యాలయంలో పలు వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఓ సిబ్బంది డీఎంహెచ్‌వోపై ఏకంగా ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. మరొక ఆసుపత్రి నర్సు కూడా బదిలీ విషయమై ఎస్సీ కమిషన్‌ను ఆదేశించినట్లు తెలిసింది. ఇటీవల కలెక్టరేట్‌లో జరిగిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ సమావేశంలో జిల్లా వైద్యాధికారిపై ఎస్సీ కమిషన్ చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేయడం ఆ తర్వాత కలెక్టర్ కూడా దీనిపై డీఎంహెచ్‌వోతో వివరణ తీసుకున్నట్లు సమాచారం.

### మైనార్టీల సంక్షేమానికి
## ప్రభుత్వం కృషి

### చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

తాండూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం తాండూరులో జీఎంకే ప్రొప్రైటర్ ముజీబ్ ఖాన్ ఆధ్వర్యంలో సాయిపూర్‌లో నిర్మించిన సయ్యద్ దూన మజీద్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం 52 మంది ఇమామ్, మోజన్స్‌లకు ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మైనార్టీలకు ప్రాధాన్యత ఇస్తూ అన్ని రంగాలకు సహకారం అందిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ మైనార్టీలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. కొడంగల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కొడంగల్ తరహాలో తాండూరును కూడా అభివృద్ధి పథంలో నడిపించేలా చొరవ చూపుతానని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సంపత్ కుమార్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా, బాల్‌రెడి స్వప్న, కమల్‌అత్తార్, నాయకులు ఇబ్రహీంఖాన్, మతీన్, ఫరిద్, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

## సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 176 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు, ఆసరా పెన్షన్లు, ఇరిగేషన్, భూ సర్వే ఇతర సమస్యలకు సంబంధించి దరఖాస్తులు అధిక సంఖ్యలో వచ్చాయన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో ఏవో పర్వీన్, సూపరింటెండెంట్లు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మేడ్చల్‌లో 57 ఫిర్యాదుల స్వీకరణ

అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులపె తీసుకునే చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో 57 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్పెషల్ డ్రైవ్ ధారూరుకేనా?

- జిల్లా వ్యాప్తంగా బ్రేక్
- సహకరించని మార్కెట్ అధికారులు
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

ధారూరు, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జీరో వ్యాపారాన్ని నిరోధించి, మార్కెట్ పన్ను ఎగవేతను నివారించేందుకు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్న కలెక్టర్ ఆదేశాలు బేఖాతార్ చేస్తున్నారు మార్కెట్ అధికారులు. స్పెషల్ డ్రైవ్ కేవలం ధారూరు మండలానికే పరిమితం చేసి మార్కెట్ ఫీజు వసూల్ చేస్తున్నారు. కాగా, గ్రామాలలో కొంతమంది వ్యాపారులు రైతుల వద్దకు వెళ్లి వేరుశనగ, ధాన్యం, మొక్కజొన్న పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ మార్కెట్ ఫీజుకు ఎగనామం పెడుతున్నారు. ఈ అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ స్పందించి జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు.

**4న ఉత్తర్వులు జారీ**

ధారూరు మార్కెట్ సహాయ కారదర్శి సిద్దమ్మ టీం లీడర్‌గా కొడంగల్, పరిగి, వికారాబాద్, ఏఎంసీల కార్యదర్శులు, నలుగురు సూపర్‌వైజర్లు, మార్కెట్ కమిటీల నుంచి ఇద్దరు చొప్పున సెక్యూరిటీ గార్డులను నియమించారు. ఈ టీం జిల్లాలో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని మార్కెటింగ్ ఉన్నతాధికారులు 4న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాలు ఇప్పటి వరకు అమలుకాకపోవటంతో స్పెషల్ డ్రైవ్ ప్రారంభం కాలేదు. ఒక్క ధారూరు మండలంలో మాత్రం రెండు రోజులుగా 111 క్వింటాళ్లకు రూ.5,989లను మార్కెట్ అధికారి సిద్దమ్మ స్పెషల్ డ్రైవ్‌లో వసూలు చేశారు. మిగతా ప్రాంతాలలో స్పెషల్ డ్రైవ్ ప్రారంభమే కాలేదని సమాచారం. ఈ బృందంలోని మార్కెట్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు ముందుకు రాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారుల ఆదేశాలనే బేఖాతర్ చేయటంతో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం కాస్త అటకెక్కి మార్కెట్‌ల ఆదాయానికి గండి పడుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## ఘనంగా వైకుంఠోత్సవం



వైకుంఠోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్‌లోని రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వైకుంఠోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సేవాకాలము, ప్రాబోధిక ఆరగింపు, మండప ప్రాకారసేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామివారిని ప్రత్యేక వేదికపై అలంకరించి వైకుంఠోత్సవం నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అంబారిపేట వంశస్తులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తిమ్మాపురం కళాకారుడికి నంది అవార్డు



ప్రభాకర్‌కు నంది అవార్డును అందిస్తున్న సినీప్రముఖులు రాజబాబు

కందుకూరు,ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన ప్రజా జానపద గాయకుడు మంద ప్రభాకర్ తెలుగు కళారత్నాలు, సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి బంగారు నంది అవార్డును అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సామెల్, సినీ ప్రముకులు రాజబాబుల చేతుల మీదుగా ప్రభాకర్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న తాను జానపద గీతాలపై మక్కువ ఉండడం వలన వాటిని తనదైన శైలిలో పాడడం వల్ల ఈ అరుదైన అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ తెలుగు కళారత్నాలు సంస్కృతికసేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ రత్నం, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు ధనరాజ్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# విలీన గ్రామాల్లో రిజిస్ట్రేషన్లకు బ్రేక్

- చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీల్లో నిలిపివేత
- కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్న అధికారులు




చేవెళ్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నూతన మున్సిపాలిటీలోని విలీన గ్రామాల్లో రిజిస్ట్రేషన్లను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేవెళ్ల, మొయినాబాద్‌ను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా మున్సిపాలిటీలకు కొత్తగా కమిషనర్లను సైతం నియమించింది. ఈ రెండు మున్సిపాలిటీల పరిధిలో ఉన్న విలీన గ్రామ పంచాయతీల్లో ప్లాట్ల రిజిస్ట్రేషన్ల క్రయ విక్రయాలను ఈనెల 7వ తేదీ నుంచి పూర్తిగా బంద్ చేసింది. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని చేవెళ్ల, ఊరెళ్ల, కేసారం, దామరిగిద్ద, రామన్నగూడ, ఇబ్రహీంపల్లి, దేవునిఎర్రవల్లి, మల్కాపూర్ గ్రామాల్లో, మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మొయినాబాద్, పెద్దమంగళారం, చిల్కూరు, ముర్తజాగూడ, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, సురంగల్, ఎన్కెపల్లి తదితర గ్రామాల్లో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు జరపొద్దని రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది.

**వ్యవసాయ భూములకు ఓకే..**

మున్సిపాలిటీల్లో విలీనమైన పంచాయతీలో ప్లాట్లకు సంబంధించి కొత్తగా మ్యాపింగ్, సీసీఏ కాపీలతోపాటు మ్యూటేషన్లలో గ్రామ పంచాయతీలకు బదులుగా మున్సిపాలిటీ పేరు నమోదు చేసేందుకు ప్రభుత్వం కొత్తగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. ఈనెల 12వ తేదీ వరకు పూర్తిస్థాయిలో అప్‌డేట్ అయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే ప్లాట్ల రిజిస్ట్రేషన్లు మాత్రమే నిలిపివేసింది. వ్యవసాయ భూములకు సంబంధించిన ధరణి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయమైన చేవెళ్ల సబ్ రిజిస్ట్రార్ దాసరి వెంకటరమణను వివరణ కోరగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో కొత్తగా ఏర్పడిన చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీ విలీన గ్రామ పంచాయతీల రిజిస్ట్రేషన్లు నిలిపివేసినట్లు తెలిపారు. ప్రభుత్వం కొత్త మున్సిపాలిటీల పేరుతో కొత్తగా స్వఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తుందన్నారు. మున్సిపాలిటీలు ఏర్పాడిన నాటి నుంచి ఆ గ్రామాలలో జరిగే రిజిస్ట్రేషన్ల టీడీ అమౌంట్ గ్రామ పంచాయతీలకు కాకుండా మున్సిపాలిటీలకు వచ్చేలా ఉన్నతాధికారులు మార్పులు చేస్తున్నారని చెప్పారు. బుధవారం వరకు అప్‌డేట్ అయ్యే అవకాశం ఉందన్నారు. ఉన్నతాధికారులు కొత్తగా చేసిన మార్పుల అనంతరం తిరిగి రిజిస్ట్రేషన్లను యాదావిధిగా కొనసాగిస్తామని సబ్‌రిజిస్ట్రార్ స్పష్టం చేశారు.

## నెలనెలా బిల్లులు ఎందుకివ్వడం లేదు



కుర్మిద్దలో మదర్‌డెయిరీ మేనేజర్ వెంకటయ్యను ప్రశ్నిస్తున్న రైతులు

యాచారం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నెలనెలా బిల్లులు ఎందుకు ఇవ్వడం లేదు. తాము అప్పులు చేసి పాడి పశువులను పెంచుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని యాచారం మండలంలోని కుర్మిద్దకు చెందిన పాడి రైతులు మాల్ మదర్‌డెయిరీ మేనేజర్ వెంకటయ్య సోమవారం కుర్మిద్ద పాల సేకరణ కేంద్రానికి వచ్చి ప్రశ్నించారు. గతంలో మాదిరిగా రైతులకు ప్రోత్సాహకాలు కూడా అందించాలని డిమాండ్ చేశారు. పాడి రైతులను ఆదుకోకపోతే ఎలా అని నిలదీశారు. అధికారులే కావాలని బిల్లులు ఇవ్వడం లేదని ఆరోపించారు. పాల ధరలను ఎందుకు తగ్గించారని మేనేజర్‌ను అడిగారు. పాల ధరలను పెంచడంపై శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రతి పది రోజులకోమారు బిల్లులు ఇవ్వాలని కోరగా తాను ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులను ఆదుకునేందుకు ప్రయత్నం చేస్తానని మేనేజర్ చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జంగయ్య తదితరులు ఉన్నారు.

## 'మన బడి' బిల్లులివ్వకుంటే ఆత్మహత్యే శరణ్యం



ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తున్న బాధితులు

బిల్లులు ఇవ్వాలంటూ ప్రజావాణిలో వినతి

వికారాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మన ఊరు - మనబడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సదుపాయాలు కల్పించే పనులు చేపట్టి రెండేళ్లవుతున్నా ఇంత వరకు బిల్లులు చెల్లించలేదని, అధికారులు స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే ఆత్మహత్యే శరణ్యమని ఎస్ఎంసీ కమిటీల బాధ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో పాటు లక్నాపూర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు అనుమతించాలని కోరారు. అప్పట్లో ఉన్నతాధికారుల మాటలు విని ఇంట్లో ఉన్న బంగారం కుదువపెట్టి పనులు చేపట్టామని, ఆ పనులు పూర్తయి రెండేళ్లవుతున్నా బిల్లులు రాలేవని వాపోయారు. తాము చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో పాఠశాలలకు తాళాలు వేస్తామని, పాఠశాలల్లోకి విద్యార్థులను అనుమతించమని, ఎన్నికల పనులకు కూడా ఆ పాఠశాలలను ఉపయోగించకుండా అడ్డుకుంటామన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో పనులు చేపట్టిన వారికి బిల్లులు చెల్లించి మిగతా నియోజవర్గాల వారికి చెల్లించకపోవడం ఎంత వరకు న్యాయమని వారు ప్రశ్నించారు. అప్పులు ఇచ్చిన వారు రోజూ తమ ఇళ్ల వద్దకు తిరుగుతున్నారని, అప్పటి కలెక్టర్, డీఈవో పనులు చేయాలని చెప్పినందుకే తాము చేశామన్నారు.

## కోర్టు ఆవరణలో మహిళ ఆత్మహత్యాయత్నం

ఆస్తి తగాదాలు, కుటుంబ గొడవలే కారణం

ఇబ్రహీంపట్నం కోర్టు వద్ద ఘటన



కూతుళ్లతో కమలాబాయి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదాలు, కుటుంబంలో గొడవల కారణంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణలో సోమవారం ఓ మహిళ ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా అక్కడ ఉన్నవారు అడ్డుకున్నారు. పోలీసులు ఆమెను స్టేషన్‌కు తెసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. వివరాల్లోకి వెళితే.. యాచారం మండలం మంథన్‌గౌరెల్లి గ్రామ పంచాయతీ కేస్లీ తండాకు చెందిన జర్పుల భద్రియ, కమలాబాయి దంపతులకు ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఉపాధి కోసం నగరంలో కూలీ పని చేసుకుంటున్నారు. భద్రియ మంథన్‌గౌరెల్లికి చెందిన మరో మహిళ పద్మతో పరిచయం ఏర్పడి రెండో వివాహం చేసుకున్నాడు. వారికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కాగా మొదటి భార్య కమలాబాయితో విడాకులు తీసుకోకుండానే రెండో వివాహం చేసుకోవడంతో ఇరువురి మధ్య ఆస్తి తగాదా నడుస్తోంది. కమలాబాయి మొదటి కూతురుకు వివాహమైంది. రెండో కూతురు వివాహం గురించి భద్రియ పట్టించుకోకపోవడంతో అతని పేరున ఉన్న రెండెకరాల్లో తనకూ వాటా కావాలని కమలాబాయి 2021లో కోర్టులో కేసు వేసింది. కోర్టు కేసు ఉండగానే భద్రియ 20 గుంటల భూమిని ఇతరులకు విక్రయించాడు. తాను నియమించుకున్న అడ్వకేట్ కూడా ప్రలోభాలకు గురై కేసు నుంచి తప్పుకుంటున్నాడంటూ ఆమె ఆందోళన వెలిబుచ్చింది. ఇదే క్రమంలో తనకు న్యాయం జరిగేలా చూడాలని ఆమె బలవన్మరణానికి పాల్పడడం అక్కడున్న వారిని కలిచివేసింది. కాగా ఇది సివిల్ తగాదా కావడంతో కోర్టులోనే తేల్చుకోవాలని పోలీసులు ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. అయితే ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కమలాబాయిపై ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి యశ్వంత్‌సింగ్ సూచనల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## వైభవం.. మల్లన్న కల్యాణం

- ఆకట్టుకున్న ఒగ్గు కళాకారుల ప్రదర్శన
- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 10, (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం బొంకూరు, బిజ్వారం గ్రామంలో మల్లికార్జునస్వామి జాతర మూడు రోజులు వైభవంగా కొనసాగింది. ధ్వజస్తంభ పూజ, వెండి పల్లకీసేవా, గంగాస్నానం, స్వస్తి పుణ్యాహవచనం, నవగ్రహ పూజ, మహా రుద్రాభిషేకం, గొలుసు తెంచుట, అగ్నిగుండం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం గ్రామం నుంచి బోనాల ఊరేగింపు తీశారు. అనంతరం భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి కల్యాణాన్ని కోటేశ్వరాశివాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కల్యాణంలో ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిలు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయ, కుర్వ కిష్టయ్య కల్యాణాన్ని, కుర్వ బసంత్, శ్రీలత, బాల్‌రాజ్,మమత, చిలకమ్మ, బాలమ్మ కుటుంబీకులు పాల్గొని ఘనంగా కల్యాణాన్ని నిర్వహించారు. రాస్నంకు చెందిన అర్చకులు వేదమంత్రోచ్ఛరణల మధ్యన కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించారు. అనంతరం ఒగ్గు కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మండల కాంగ్రెస్ ఎర్రీ అధ్యక్షుడు జెర్నె నాగప్ప, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు, కాంగ్రెస్ నాయకులు వడ్డె శ్రీనివాస్, కోతి గోపాల్, కరన్‌కోట్ జగదీశ్వర్, ఉదయ భాస్కర్‌రెడ్డి, సాయిలు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుర్వ సంఘం ప్రతినిధులు పూజారి పాండు, నర్సింహులుతోపాటు మరికొంత మంది సభ్యులకు ఎముకల ఆయుర్వేద నాటు వైద్యులు, ఆలయ ధర్మకర్త కుర్వ కిష్టయ్య సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## కాస్మెటిక్ సైన్స్‌లో విద్యార్థినులకు శిక్షణ

డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ముందుకు వస్తే కాస్మెటిక్ సైన్స్‌లో విద్యార్థినీలకు శిక్షణను ఇవ్వడానికి ఫ్రాన్స్‌లోని యూరోపియన్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీతో కొలాబరేషన్ కల్గిఉన్న అబిస్ ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ కాస్మెంటిక్ సైన్స్ సంస్థ అంగీకరించిందని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి తెలిపారు. సింగపూర్‌లోని నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు హాజరైన షాద్‌నగర్ నివాసి సామ రవీందర్‌రెడ్డి సోమవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. చదువుతున్న విద్యార్థినీలు స్వయం ఉపాధిని పొందేవిధంగా అబిస్ ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ కాస్మెంటిక్ సైన్స్ సంస్థ పలు కోర్సులపై శిక్షణను ఇస్తున్నదని తెలిపారు. షాద్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థినీలతో పాటు ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోని విద్యార్థినీలకు శిక్షణ ఇవ్వాలని సంస్థ డైరెక్టర్ సకినా పంజాబ్‌ను కోరగా అందుకు ఆయన అంగీకరించారని తెలిపారు. కళాశాలల ప్రిన్సిపల్స్ విద్యార్థినీల అంగీకారం తీసుకుని శిక్షణ కోసం నివేదికను పంపిస్తే ఎంఓయు కుదుర్చుకుని ఆన్‌లైన్ కోర్సులను ప్రారంభిస్తారని డాక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

## తిరుపతిరెడ్డికి సన్మానం



తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డిని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సన్మానించారు. సోమవారం తాండూరు పర్యటనకు వచ్చిన ఆయనను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద తాండూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి స్వాగతం పలికారు. తిరుపతిరెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పలకరిస్తు స్థానిక సంస్థల ఎన్నికల్లో అఖండ మెజార్టీ సాధించాలని సూచించారు. ఆయన వెంట మాజీ జడ్పీటిసి దారాసింగ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, తదితరులు ఉన్నారు.

## ఆర్టీఏ మెంబర్‌కు..



వికారాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజమతుల్లాహ హుస్సేని సోమవారం వికారాబాద్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా ఆర్టీఏ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్‌ను మర్యాదపూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిశారు. జాఫర్‌ను చైర్మన్ సన్మానించగా, జాఫర్ చైర్మన్‌ను సన్మానించారు. అనంతరం వారు వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

## కుదింపు!

(5వ పేజీ తరువాయి)

ఇదే తరహాలోనే ఉంది. గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో చేరడంతో వీటి సంఖ్య భారీగానే తగ్గింది. జిల్లాలో 257 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వీటిలో 25 స్థానాలు మున్సిపాలిటీల్లో విలీనమయ్యాయి. ఔటర్ చుట్టూ ఉన్న గ్రామాలను మున్సిపాలిటీల్లో చేర్చడంతో ప్రస్తుతం వీటి సంఖ్య 232కు చేరింది. ఆయా మండలాలు మున్సిపాలిటీలుగా రూపాంతరం చెందుతుండటంతో ఎంపీటీసీ సంఖ్య తగ్గుతూ వస్తుంది. జిల్లాలో ఎనిమిది శాసనసభ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 27 మండలాలు ఉండగా.. వీటిలో హయత్‌నగర్, సరూర్‌నగర్, బాలాపూర్, గండిపేట్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి మండలాలను పూర్తిగా అర్బన్ మండలాలుగా ప్రభుత్వం గుర్తించింది. ఈ అర్బన్ మండలాలన్నీ జీహెచ్ఎంసీ పరిధిలో భాగంగానే ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం 21 గ్రామీణ మండలాలున్నాయి. వీటిలో 21 జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రంగారెడ్డి జిల్లాలో 558 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో నుంచి 9 గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. దీంతో పంచాయతీల సంఖ్య 549కి చేరుకుంది. కొత్తగా మున్సిపాలిటీల ఏర్పాటుతో మరో 18 పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేశారు. దీంతో గ్రామ పంచాయతీల సంఖ్య 531కి చేరుకుంది. ఈ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. అధికారులు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఎన్నికలు జరిగే 531 గ్రామ పంచాయతీల్లో 4,710 వార్డులు ఉన్నాయి. కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటుతో ఏటేటా గ్రామ పంచాయతీల సంఖ్య తగ్గుతూ పోతున్నాయి. కానీ.. మున్సిపాలిటీల సంఖ్య పెరుగుతూ వస్తున్నాయి. జిల్లాలో ఇంతకు ముందు 13 మున్సిపాలిటీలు, 3 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. కొత్తగా ఈసారి చేవెళ్ల, మొయినాబాద్ మండలాలు మున్సిపాలిటీలుగా రూపాంతరం చెందాయి. దీంతో మున్సిపాలిటీల సంఖ్య 15కు చేరుకుంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ సంఖ్య ప్రస్తుతం 18కి చేరుకుంది.

**మేడ్చల్ జిల్లాలో..**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 41 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 28 స్థానాలు మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. ప్రస్తుతం ఎంపీటీసీ స్థానాల సంఖ్య 19కి చేరుకుంది. జిల్లాలో 62 గ్రామ పంచాయతీలు ఉండగా 28 పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేశారు. ప్రస్తుతం ఆ సంఖ్య 34 గ్రామ పంచాయతీలకు చేరుకుంది. తొమ్మిది మున్సిపాలిటీలు, నాలుగు కార్పొరేషన్లుగా ఉన్నాయి. జిల్లాలో ఇంతకు ముందు ఘట్‌కేసర్, కీసర, మేడ్చల్, మూడు చింతలపల్లి, శామీర్‌పేట మండలాలు జడ్పీటీసీలుగా ఉండేవి. ఘట్‌కేసర్, కీసర మండలాలు మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో రెండు జెడ్పీటీసీ స్థానాలు తగ్గాయి. ప్రస్తుతం వీటి సంఖ్య (మేడ్చల్, మూడు చింతలపల్లి, శామీర్‌పేట్) మూడుకు చేరుకుంది.

**వికారాబాద్‌లో పెరిగిన స్థానాలు**

వికారాబాద్ జిల్లాలో కొత్తగా ఆరు ఎంపీటీసీ స్థానాలు పెరిగాయి. ఇంతకు ముందు 18 మండలాల పరిధిలో 221 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, జిల్లాలో రెండేళ్ల కిందట పెరిగిన చౌడాపూర్, దుద్యాల మండలాలతో ఎంపీటీసీ స్థానాల సంఖ్య 227కు పెరిగింది. ఇంతకు ముందున్న ఎంపీటీసీ స్థానాలతో పోలిస్తే కులకచర్ల మండలంలో 4, పరిగి మండలంలో 2, దౌల్తాబాద్ మండలంలో ఒకటి, బొంరాస్‌పేట్ మండలంలో 4 ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. ఇంతకు ముందు కులకచర్ల మండలంలో 16 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, కొత్తగా ఏర్పాటైన చౌడాపూర్ మండలంతో ఇప్పుడు 12 స్థానాలకు తగ్గాయి. పరిగి మండలంలో ఇది వరకు 13 ఎంపీటీసీలు ఉండగా, మారిన సమీకరణాలతో 11 స్థానాలకు తగ్గాయి. దౌల్తాబాద్ మండలంలో ఇంత వరకు 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, ఇప్పుడు 14 స్థానాలకు తగ్గాయి. బొంరాస్‌పేట్ మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, కొత్తగా ఏర్పాటైన దుద్యాల మండలంతో ఇప్పుడు 11 స్థానాలకు పరిమితం కానుంది. కాగా, కొత్తగా ఏర్పాటైన చౌడాపూర్ మండలంలో 9 ఎంపీటీసీ స్థానాలు, దుద్యాల మండలంలో 8 ఎంపీటీసీ స్థానాలు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే, జిల్లాలో కొత్తగా మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 12, నారాయణపేట జిల్లా నుంచి 2 గ్రామ పంచాయతీలు విలీనమయ్యాయి. జిల్లాలో ఇంతకు ముందు 585 గ్రామ పంచాయతీలు ఉండగా, కొత్తగా విలీనమైన పంచాయతీలతో 599 పంచాయతీలకు పెరిగాయి. ఇదిలా ఉంటే, పరిగి మునిసిపాలిటీలో కొత్తగా పరిగి మండల పరిధిలోని నస్కల్, రుక్కుంపల్లి, సుల్తాన్‌పూర్, మల్కాపూర్, నజీరాబాద్ గ్రామ పంచాయతీలను విలీనమయ్యాయి. దీంతో జిల్లాలో గ్రామ పంచాయతీల సంఖ్య 594, వార్డుల సంఖ్య 5058కు చేరుకుంది.

## హత్య చేసిన వ్యక్తికి పదేళ్లు జైలు

షాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి ని హత్య చేసిన ఘటనలో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. 2021లో మండల పరిధిలోని లక్ష్మారావుగూడ గ్రామ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్ వద్ద స్నేహితుల మధ్య ఘర్షణలో రమేష్, నర్సింహులు ఇద్దరు కలిసి మరొక వ్యక్తిని హత్యచేశారు. అప్పట్లో వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తర్వాత రమేష్ మృతిచెందాడు. నేరం రుజువుకావడంతో నర్సింహులుకు పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.15 వేలు జరిమానా విధిస్తూ సోమవారం ఎల్బీనగర్ అదనపు కోర్టులో న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కేసులో అప్పటి ఇన్‌స్పెక్టర్ అశోక్‌తోపాటు ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి, రఘు, సత్యనారాయణ సిబ్బంది వెంకటేశ్, అనీఫ్, ప్రభాకర్, జంగయ్య కృషితో నిరూపితం అయిందన్నారు.

## నైపుణ్యాలు వెలికితీయడానికే హ్యాకథాన్




మాట్లాడుతున్న డీన్ విజయ్‌కుమార్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలు వెలికితీయడానికి హ్యాకథాన్లు దోహదపడుతాయని అనురాగ్ యూనివర్సిటీ డీన్ విజయ్‌కుమార్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో సోమవారం హ్యాక్‌ట్రానిక్స్ హ్యాకథాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హ్యాకథాన్లతో విద్యార్థుల్లోని సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. రెండురోజుల్లో 36 గంటలపాటు హ్యాక్‌ట్రానిక్స్ హ్యాకథాన్ జరుగుతుందని తెలిపారు. వివిధ కళాశాలల నుంచి 350 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీకాంత్‌రెడ్డి, ప్రదీప్, సాయి సంతోషి, మంగళగౌరీ, నారాయణ, పవిత్ర, అమృత పాల్గొన్నారు.

## ఓంకారేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన



స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సతీమణి ఉమారామ్మోహన్‌రెడ్డి

కులకచర్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కులకచర్లలో కొత్తగా నిర్మించిన శ్రీ ఓంకారేశ్వరస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం వీరశైవలింగాయత్, లింగ బలిజ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శివుడు, నంది ఇతర విగ్రహాలతోపాటు ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. మూడు రోజులుగా శివనామస్మరణతో కులకచర్ల మార్మోగింది. వేలాది మంది భక్తులు పాల్గొల్లో పాల్గొన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సతీమణి ఉమారామ్మోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎన్నే ఈశ్వరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీలు కృష్ణయ్యగౌడ్, ఆనంద్, మాజీ సర్పంచ్‌లు జానకీరామ్, సౌమ్యరెడ్డి, వీరశైవలింగాయత్, లింగ బలిజ సంఘం సభ్యులు మంతయ్య, కాశీనాథ్, వీరేశం, ఈశ్వరయ్య, సతీశ్‌కుమార్, రవిచందర్ పాల్గొన్నారు.

## భారత సంస్కృతిని కాపాడుకోవాలి



క్విజ్ పోటీల్లో విద్యార్థులు

ఆమనగల్లు , ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని రామదూత ఆశ్రమ పీఠాధిపతి శివానంద స్వామి అన్నారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే దేశభక్తి భావాలు పెంపొందించుకొని రామాయణం, మహాభారతం పురాణాల గురించి తెలుసుకోవాలన్నారు. ఆమనగల్లు పట్టణంలోని సరస్వతీశిశుమందిర్‌లో సోమవారం శ్రీ రామదూత ఆశ్రమం, శ్రీ అభయాంజనేయ భజన మండలి సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు వేద పురానేతిహాస ప్రహేళిక క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆమనగల్లు పట్టణంలోని 11 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి పీఠాధిపతి శివానంద స్వామి, శిశుమందిర్ పాఠశాల అధ్యక్షుడు పాపిశెట్టి రాములు హాజరయ్యారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో దొంతు విశ్వనాథం, దొంతు సత్యనారాయణ,, నారాయణ గౌడ్, దామోదర్, బుచ్చిరాములు, బావండ్ల అంజయ్య, యాదిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆనంద్, కవిత, భద్రయ్య, నయనాచారి, చంద్రశేఖర్, వాసు, అంజయ్య, లింగయ్య, శ్రీకాంత్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

## మా భూములు మాకు ఇప్పించండి

నందిగామ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): 'మా భూములు మాకు ఇప్పించండి సారూ' అంటూ 1975లో భూదాన్ భూమి పట్టాపొందిన రైతులు సోమవారం రంగారెడ్డి కలక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో కలక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. 1975లో ఆంధ్రప్రదేశ్ భూదాన్ బోర్డు 6346/1975 నంబర్ ఉత్తర్వుల ద్వారా నందిగామ మండల కేంద్రానికి చెందిన 18 మంది పేదలకు అప్పటి గ్రామసభ తీర్మానం మేరకు సర్వే నంబర్లు 638, 639, 845, 846, 848, 849, 850, 852లలో 99 ఎకరాల 22 గుంటల భూమికి ప్రొసీడింగ్ ఇచ్చారు. భూదాన్ బోర్డు అందించిన భూములకు 1977లో ఐఎ/4749/1977 నకిలీ ఓఆర్సీ సృష్టించి కొందరు కబ్జా చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. అప్పటి నుంచి మేము అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం జరగడంలేదని, సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎనిమిది రోజులుగా నందిగామ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నాయకులు సాయిబాబ, చెన్నగళ్ల అశోక్, రైతులు శ్రీను, వెంకటయ్య, బొంగుపల్లి జంగయ్య, పోచయ్య, యాదమ్మ, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాములు నాయక్‌ను కలిసిన నాయకులు



రాములు నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న రమేశ్ నాయక్, శ్రీను నాయక్

ఆమనగల్లు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత బంజార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్‌ను సోమవారం ఆమనగల్లు మండలానికి చెందిన బంజార దివ్యాంగుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో రాములును కలిసి దివ్యాంగులకు పెన్షన్, స్వయం ఉపాధి పథకాలు, ప్రభుత్వ పథకాల్లో పెద్దపీట వేయాలని వినతిపత్రం అందజేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌నాయక్, ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్ తెలిపారు. ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేస్తానని రాములు నాయక్ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

## పాంబండ ఆలయ ఈవోకు సన్మానం


బాలనర్సయ్యను సన్మానిస్తున్న మైపాల్‌రెడ్డి

కులకచర్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలం బండవెల్కిచర్ల పాంబండ ఆలయ ఈవోగా బాలనర్సయ్య సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి, ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఇక్కడ ఏడు సంవత్సరాలుగా పని చేసిన ఈవో సుధాకర్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆలయ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని నూతన ఈవో బాలనర్సయ్య తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు పాండుశర్మ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం


సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఆంజనేయులు

కులకచర్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు అన్నారు. సోమవారం ఇప్పయిపల్లి గ్రామ రోకటి గుట్ట తండాలో ఉపాధి పథకం కింద సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతీగ్రామానికి సీసీ రోడ్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మంజూరు చేశారని తెలిపారు. పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, బ్లాక్‌టు అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, బాల్‌రెడ్డి, సతీశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో ఉండాలి: ఎస్ఐ


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ మధుసూదనరెడ్డి

పూడూరు, ఫిబ్రవరి 10, (ఆంధ్రజ్యోతి) : వచ్చే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి సూచించారు. సోమవారం ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు స్టేషన్‌కు పిలిపించి వారిని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మధుసూదనరెడ్డి హెచ్చరించారు.

## ఆలయ భూములను కాపాడండి


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రావుల్‌పల్లి గ్రామస్తులు

మర్పల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆలయ భూములు కబ్జా చేస్తున్నారని రావుల్‌పల్లి గ్రామస్తులు తెలిపారు. ఆ మేరకు మర్పల్లి తహసీల్దార్ మునిరొద్దీన్‌కు ఫిర్యాదు చేశారు. రావుల్‌పల్లికి చెందిన పీతాంబరేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన సర్వే నెం.162లో మూడు ఎకరాలు, సర్వే నెం.63 /1లో 8 ఎకరాల భూమి ఉందన్నారు. ఇది ఆలయం పేరుపై కొనసాగుతుందని తెలిపారు. అయితే ఆలయ చుట్టుపక్కల భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొన్నారని, పై సర్వేనెంబర్లలోని భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు ఆలయ భూములను కాపాడాలని కిషన్, అంజయ్యగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నరేశ్, శివకుమార్, రాచన్న ఫిర్యాదు చేశారు.

## పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్


చెక్కు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్‌ఎఫ్) అండగా ఉంటుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం బొంరాస్‌పేట్ మండలం మేడిచెట్టు తండా పంచాయతీలో లబ్ధిదారుడు శంకర్‌నాయక్‌కు ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.50వేల చెక్కు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, నాయకులు బాపల్లి సంతోష్‌నాయక్, వినోద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

కీసర రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : సీఎం రిలీఫ్‌ఫండ్‌తో పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. నాగారం మున్సిపాలిటీ, సింహపురి కాలనీకి చెందిన మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ఆయన సోమవారం రూ. 2,50 లక్షల ఎల్‌వోసీ అందజేశారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు చెక్కులు అందుతున్నాయని గుర్తుచేశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేదలను ఆదుకోవడానికి ప్రభుత్వం అహర్నిశలు పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బషీరాబాద్ డీటీగా రుక్సానాబేగం

బషీరాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ మండల డిప్యూటీ తహసీల్దార్‌గా రుక్సానాబేగం సోమవారం బాధ్యతలు చేపట్టారు. బొంరాస్‌పేట్ మండల డిప్యూటీ తహసీల్దార్‌గా రెగ్యులర్ పోస్టులో నియమితులైనప్పటికీ డిప్యూటేషన్‌పై బషీరాబాద్ మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వై.వెంకటేషను కలిసి ఉత్తర్వుల కాపీని అందజేసి విధుల్లో చేరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ అధికారులకు, సిబ్బందిని డీటీకి పరిచయం చేశారు.

# అడ్డదిడ్డంగా వాహనాల నిలిపివేత

- ట్రాఫిక్‌కు అంతరాయం
- వాహనదారులకు తప్పని తిప్పలు
- రైల్వే స్టేషన్ కూడలి రోడ్డులో పెరుగుతున్న రద్దీ


నడిరోడ్డుపై నిలిపిన బస్సు

బషీరాబాద్, ఫిబ్రవరి 10: మండల కేంద్రమైన బషీరాబాద్‌లో బస్టాప్(షెల్టర్) లేకపోవడంతో ఆర్టీసీ బస్సులను డ్రైవర్లు రోడ్డు మధ్యలో నిలుపుతున్నారు. దీంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. స్థానిక రైల్వే స్టేషన్ కూడలి ప్రధాన రోడ్డులో నిత్యం రద్దీగా ఉంటుంది. ఉద్యోగులు, ప్రయాణికులు అందరూ కూడా ఈ ప్రాంతంలోనే బస్సు ఎక్కుతున్నారు. ఈ ఏరియాలో కొత్తగా దుకాణాలు ఏర్పడటం, రోడ్డు ఇరుకుగా ఉండటం సైతం వాహనాల రాకపోకలకు ఆటంకం అవుతోంది. ప్రైవేటు వాహనాలు జీపులు, ఆటోలు కూడా పదుల సంఖ్యలో ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటాయి. ప్రతీమంగళవారం సంతతో రద్దీ అధికంగానే ఉంటుంది. ఇదిలా ఉంటే బషీరాబాద్‌లో బస్టాండ్ ఉన్నా ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంది. అధికారులు వినియోగంలోకి తీసుకురావాలని, దీంతో కొంతైనా కూడలిలో రద్దీ తగ్గే చాన్స్ ఉందని పలువురు చెబుతున్నారు.

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

### వికారాబాద్ సీఐ భీమ్‌కుమార్



సభలో సీఐ భీమ్ కుమార్, వివేకానంద మిత్రబృందం సభ్యులు

వికారాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మనం ఎంచుకున్న స్నేహితుడి మీద మన జీవితం ఆధారపడి ఉంటుందని వికారాబాద్ సీఐ భీమ్‌కుమార్ తెలిపారు. ఆదివారం వికారాబాద్ మండలం గోధుమగూడలో స్వామి వివేకానంద మిత్రబృందం స్మారక వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. అనంతరం గెలుపొందిన బహుమతులు ప్రదానం చేశారు. మన ఆలోచనలు ఎప్పుడు పెద్దగా ఉండాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పరిగి ఎస్ఐ సంతోష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దేముల్‌లో అంబులెన్స్ ప్రారంభం


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఉచిత సేవల అంబులెన్స్ సర్వీసును ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. మండలానికి చెందిన సుమిత్రరాథోడ్ ఆధ్వర్యంలో విరించి ఆస్పత్రి - ఉచిత సేవల అంబులెన్స్ సమకూర్చిందని, అత్యవసర సమయంలో ప్రజలు ఉచితంగా ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ధారాసింగ్, శోభారాణి, నారాయణరెడ్డి, మహిపాల్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, విద్యాసాగర్, రియాజ్, కిరణ్, డీవై.నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం


స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. సోమవారం బొంరాస్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమం జరిగింది. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం హరిలాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, బొంరాస్‌పేట్ మండలం నాగిరెడ్డిపల్లిలో హంసన్‌పల్లి వెంకటేశ్, శ్రీనివాసులు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 50 మందికి నోటుబుక్‌లు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత స్థానాలను అధిరోహించాలని వారు సూచించారు.

## కాంగ్రెస్ సేవాదళ్ సీనియర్ నాయకుడి మృతి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సేవాదళ్ సీనియర్ నాయకుడు ఆయూబ్‌ఖాన్(65) సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయూబ్ ఖాన్ కాంగ్రెస్ సేవాదళ్‌లో అనేక సంవత్సరాలు వివిధ హోదాల్లో పని చేశారు. గతంలో గాంధీ భవన్ సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్‌గా పని చేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. మృతి విషయం తెలుసుకున్న పలువురు నాయకులు ఆయన పార్థీవదేహంపై పూల మాలలువేసి నివాళులర్పించారు. అనంతరం సాయంత్రం అంత్యక్రియలు పూర్తిచేశారు.

# కళావిహీనంగా పల్లె ప్రకృతివనాలు!

- నిర్వహణ అధ్వానం
- నాడు ఆహ్లాదం నేడు అపరిశుభ్రత


బాబునాయక్‌తండా శివారులో ముళ్ల పొదలతో నిండిన పల్లెప్రకృతి వనం

బషీరాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పల్లె ప్రకృతివనాల నిర్వహణ లేమితో అధ్వానంగా తయారయ్యాయి. మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఆహ్లాదాన్ని పంచేందుకు నెలకొల్పగా తొలుత సవ్యంగా సాగాయి. రానురానూ నిర్వహణను పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. దీంతో పల్లె ప్రకృతి వనాలు దాదాపు అన్ని చోట్ల పిచ్చిమొక్కలు, ముళ్ల పొదాలతో అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుని పల్లె ప్రకృతి వనాలను వినియోగంలోకి తేవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఘనాపూర్‌లో వెలసిన అక్రమ నిర్మాణాలపై అదే గ్రామానికి చెందిన వేముల మహేశ్వర్‌గౌడ్, బొక్కానిగూడకు చెందిన కృష్ణారెడ్డిలు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సర్వేనెంబర్‌లు 1140, 1141లలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నిర్మాణాలపై గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కళాశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## అర్హులందరికీ రేషన్‌కార్డులు


విచారణ జరుపుతున్న ఆర్ఐ సాయిచరణ్ తదితరులు

యాలాల, ఫిబ్రవరి 10, (ఆంధ్రజ్యోతి) :అర్హులైన ప్రతీఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ఆర్ సాయిచరణ్ అన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో భాగంగా కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారుల గుర్తింపు విచారణ కొనసాగుతోంది. సోమవారం మండలపరిధిలోని కోకట్‌లో ఆయన ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. దరఖాస్తుల వివరాలను ఇంటింటికీ వెళ్లి విచారణ చేపట్టారు.

## నోటిఫికేషన్ విడుదల


నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వరాలయం

బషీరాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వరాలయం ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు ఈవో మధు సోమవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 15 రోజుల్లోగా సంబంధిత సహాయ కమిషనర్ దేవాదాయ, ధర్మాదాయశాఖ రంగారెడ్డి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## నులిపురుగుల నివారణపై అవగాహన

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. వైద్యుడు సాకేత్ మాట్లాడుతూ నులిపురుగుల సంక్రమణ శరీరంలో ఏ విధంగా జరుగుతుంది, వాటి నిర్మూలన, పరిశుభ్రత గురించి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానమ్, అధ్యాపకులు రాంబాబు, శ్రీనివాస్, రమేశ్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

## మాజీ ఉపసర్పంచ్‌కు పరామర్శ


హన్మంతును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 10, (ఆంధ్రజ్యోతి) : తాండూరు మండలం బిజ్వార్ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ పోతుగంటి హన్మంతును సోమవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పరామర్శించారు. హన్మంతు అనారోగ్యంతో బాధపడుతుండగా విషయం తెలుసుకొని ఇంటికి వెళ్లి పరామర్శి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట గ్రామస్తులు, నాయకులు పలువురు ఉన్నారు.

## రేపు శ్రీవారి కల్యాణం

తాండూరు రూరల్, ఫిబ్రవరి 10, (ఆంధ్రజ్యోతి) : దస్తగిరిపేట్ శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పది వారం రోజులుగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామి కల్యాణం, రథోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారి అశ్వవాహన సేవా, ఉయ్యాల సేవ జరగనుంది. అనంతరం మంగళహారతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకులు వెంకటాచార్ శుక్రవార్, రామచార్ శుక్రవార్, పురంధరాచార్ శుక్రవార్‌లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించాలని కోరారు.


కొలువుదీరిన దేవతామూర్తులు

## క్రైం కార్నర్

### మద్యం మానేయాలని భార్య మందలింపు

#### ఉరేసుకొని భర్త ఆత్మహత్య


నరేష్ మృతదేహం

పూడూరు, ఫిబ్రవరి 10, (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన పూడూరు మండల నిజాంపేట్ మేడిపల్లిలో చోటుచేసుకుంది. చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వడ్ల నరేష్(35), వడ్ల లావణ్య(శ్రీలత) దంపతులు. రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో నరేష్ కాలు విరిగింది. అప్పటి నుంచి ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. తరచుగా భార్య మందలించినా ప్రవర్తనలో ఏ మార్పూ రాలేదు. రెండు రోజుల క్రితం కూడా మద్యం మానేయాలని మరోసారి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన భర్త ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### ఇద్దరు యువతులపైకి దూసుకెళ్లిన లారీ

- తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలింపు


కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

మూడుచింతలపల్లి, ఫిబ్రవరి 10, ( ఆంధ్రజ్యోతి ) : బస్సు కోసం ఎదురుచూస్తున్న ఇద్దరిపై రెడీమిక్స్ లారీ దూసుకెళ్లిన ఘటనలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... తూంకుంట మున్సిపాలిటీ అంతాయిపల్లికి చెందిన గాయత్రి, భవానీలు.. నగరంలోని ఓ కాల్‌సెంటర్‌లో పని చేస్తున్నారు. సోమవారం ఉదయం బస్సు కోసం బిట్స్ చౌరస్తాలో వేచి ఉన్నారు. అదే సమయంలో అంతాయిపల్లి నుంచి తూంకుంట వైపు రెడీమిక్స్ లారీ వస్తోంది. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించే క్రమంలో రోడ్డు పక్కన కూర్చున్న యువతులపైకి దూసుకెళ్లి కొద్ది దూరం ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన గాయత్రి, భవానీలను చికిత్స నిమిత్తం ఒక ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలియడంతో రోడ్డుపై గ్రామస్తులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆందోళనకారులను సముదాయించడంతో రాస్తారోకో విరమింపజేశారు. అయితే రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు బాధితులకు న్యాయం చేయాలని మేడ్చల్ కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.

### గుర్తుతెలియని వ్యక్తి మృతి

కీసర రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి కీసరలోని రామలింగేశ్వరస్వామి మద్యం దుకాణం వద్ద గుర్తుతెలియని వ్యక్తి(40) అపస్మారకస్థితిలో పడి ఉన్న విషయాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వ్యక్తి మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిపారు. బూడిద రంగు చొక్కా, నీలంరంగు జీన్స్‌ప్యాంట్ ధరించినట్లు చెప్పారు. ఆచూకీ తెలిస్తే కీసర పోలీసులను ఆశ్రయించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


### గంజాయి విక్రేత రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ పందిరి పరశురాం తెలిపిన వివరాల ప్రకారం... ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, గుంటుగూడెంకు చెందిన చింత శివకుమార్(24) మూడేళ్ల నుంచి గంజాయికి బానిసయ్యాడు. నగరంలోని ధూల్‌పేట్ నుంచి గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయిని కొని ఘట్‌కేసర్ చిన్నచెరువుకట్టపై రాళ్ల కింద దాచిపెట్టి అవసరమైనప్పుడల్లా పరిసరాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. సోమవారం ఘట్‌కసర్‌లో గంజాయి విక్రయించడానికి యత్నిస్తుండగా అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శివకుమార్ నుంచి 85 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా గువ్వలపల్లికి చెందిన నూనావత్ రమేష్(30) తన భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి మేడ్చల్ పట్టణం కిందిబస్తీలో అద్దెకు నివాసం ఉంటున్నాడు. అతను మద్యానికి బానిసై ఆదివారం రాత్రి కూడా మందు తాగి పిల్లలతో గొడవకు దిగాడు. సోమవారం ఉదయం ఇంటి ఎదుట గల ఖాళీ స్థలంలో అనుమానాస్పదస్థితిలో శవమై కనిపించాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## 12 ఎంపీటీసీ స్థానాల గుర్తింపు


ఎంపీటీసీ స్థానాల ప్రతులు చూపుతున్న రామకృష్ణ

కులకచర్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండల పరిధిలో 12 ఎంపీటీసీ స్థానాలను గుర్తించినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. సోమవారం ఎంపీటీసీ స్థానాలను ప్రచురించారు. మండల పరిధిలో కులకచర్ల, కామునిపల్లి, తిరుమలాపూర్, ఇప్పయిపల్లి, కుసుమ సముద్రం, పుట్టపహాడ్, అంతారం, ఘనపూర్, సాల్విడ్, బండవెల్కిచర్ల, ముజాహిద్‌పూర్, పటేల్ చెరువు తండా ఎంపీటీసీ స్థానాలను గుర్తించినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 38,413 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అందులో పురుషులు 19,123 మహిళలు, 19,286 పురుషులు, ఇతరులు నలుగురు ఉన్నారని తెలిపారు.

## విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు



వికారాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రామ మందిరంలో కన్యకా పరమేశ్వరి దేవాలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపనలో భాగంగా సోమవారం పలు రకాల కార్యక్ర మాలు ఘనంగా నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం,ం భజన కార్యక్రమాలు, మంగళహారతి, మంత్ర పుష్పం తదుపరి మహాప్రసాద వితరణ కార్యక్రమాలు సైతం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.